# నమస్తే తెలంగాణ
# మహబూబ్‌నగర్
## నారాయణపేట

5 | మహబూబ్‌నగర్, గురువారం 24 అక్టోబర్ 2024 | MAHABUBNAGAR NARAYANPET



• మాగనూరు, కృష్ణలో నేలకొరిగిన వరి • నిజాలాపూర్‌లో ఆరబెట్టిన ధాన్యం వర్షార్పణం



మాగనూర్ సమీపంలో నేలకొరిగిన పంటను చూపిస్తున్న రైతు

# కష్టం కన్నీటిపాలు

మాగ నూరు, అక్టోబర్ 23 : ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికొచ్చిందని మురి సేలోపే వరుణ దేవుడు కన్నీళ్లు మిగిల్చాడు. మంగళవారం రాత్రి కురి సిన వర్షానికి వరి పైరు నేలకొరిగి గింజలు నేలరా లాయి. పంటలో నీళ్లు అధికంగా చేరడంతో చేసేది లేక రైతులు అదే పంటలో కూర్చొని బోరున విలపిం చారు. మాగనూర్, కృష్ణ మండలంలోని పలు గ్రామాల్లో కోతకొచ్చిన వరి పంట ఈదురుగాలలు, వర్షానికి నేలకొరి గింది. ఎకరానికి రూ.40వేల వరకు పెట్టుబడితో సాగు చేయగా, పంటచేతికొచ్చే సమయంలో నేలపాలు కావడంతో దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందిం చాలని కోరుతున్నారు. కాగా, ఈ విషయమై మాగ నూర్ మండల వ్యవ సాయ అధికారి సుదర్శన్ గౌడ్‌ను బుధవారం వివరణ కోరగా, పంట నష్టం వివరాలు సేకరించి ఉన్నతా ధికా రులకు నివేదిస్తామని తెలిపారు.



మాగనూర్‌లో నేలకొరిగిన వరి పంట

### కొట్టుకుపోయిన రైతుల ఆశలు

### రైతులకు నష్టం..

మూసాపేట, అక్టోబర్ 23 : మూసాపేట మండలంలోని నిజాలాపూర్‌కు చెందిన రైతు లక్ష్మయ్య మూసాపేట శివారులో 6 ఎకరాలు కౌలుకు తీసుకొని వరి సాగుచేశాడు. కౌలు, పెట్టుబడి కలిపి ఇప్పటి వరకు మొత్తం రూ.1,80,000 ఖర్చయినట్లు తెలిపాడు. పంటను మిషన్‌తో కొత చేయించి కల్లంలో ఆరబెట్టాడు. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి వరిధాన్యం నీటిపాలమైంది. ధాన్యంలో భారీగా చేరిన నీటిని తొలగించేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. అయినప్పటికీ తడిసిన ధాన్యంతో నష్టాలు తప్పవని బాధిత రైతు వాపోతున్నాడు. కాగా, కొనుగోలు కేంద్రాలు త్వరగా ఏర్పాటు చేయకపోవడంతో చాలా చోట్ల ధాన్యం నిల్వకు స్థలం లేక అకాల వర్షాలకు వర్షార్పణం అవుతున్నట్లు రైతులు వాపోతున్నారు.



మూసాపేట మండలం నిజాలాపూర్‌లో తడిసిన ధాన్యాన్ని తీస్తున్న రైతు లక్ష్మయ్య



ముడా చైర్మన్ సీటులో లక్ష్మణ్‌యాదవ్‌ను కూర్చోబెట్టిన మంత్రి జూపల్లి, ఎమ్మెల్యేలు

# అన్నివర్గాల సంక్షేమానికి కృషి

- ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి
- ముడా చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన లక్ష్మణ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, అక్టోబర్ 23 : అన్నివర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తున్నదని ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం సమీపంలోని శివ సాయినగర్ కాలనీలోని ముడా కార్యాలయంలో చైర్మన్‌గా లక్ష్మణ్‌యాదవ్ ప్రమాణ స్వీకారం, పదవీ బాధ్యతలు చేపట్టారు. అనంతరం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎనుగొండలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. ఆరు గ్యారెంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తోనే సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. అనంతరం ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్ మాట్లాడుతూ.. కష్టకాలంలోనూ పార్టీకి కట్టుబడి ఉండడం తోనే ముడా చైర్మన్ పదవి తనను వరించిందన్నారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు అనిల్ యాదవ్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, మహబూబ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత, వైస్ చైర్మన్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రైతుభరోసా అడిగితే కేసులా..?



పర్దీపూర్‌లో రైతులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

- తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదు
- కరోనాలోనూ కేసీఆర్ రైతుబంధు సాయం ఇచ్చారు
- కాంగ్రెస్ చేతగాని తనంతో రైతన్నకు తప్పని కష్టాలు
- మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

దేవరకద్ర రూరల్(చిన్న చింతకుంట), అక్టోబర్ 23 : రైతు భరోసా ఇవ్వాలని రైతులు అడిగితే అక్రమంగా కేసులు పెట్టడం ఎంత వరకు సమంజసమని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. రైతు భరోసా ఇవ్వలేమని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేసిన ప్రకటనపై చిన్నచింతకుంట మండలం పర్దీపూర్‌లో బీఆర్‌ఎస్ శ్రేణులు, రైతులు నిరసన తెలిపినందుకు వారిపై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టింది. దీంతో ఆల వెంకటేశ్వర్‌రెడ్డి బుధవారం పర్దీపూర్ గ్రామంలో వారిని కలిసి మనోధైర్యాన్నిచ్చారు. ఈ సందర్భంగా ఆల మాట్లాడుతూ ఇచ్చిన హామీలు అమలు చేసేందుకు చేతగాక ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టించడం దారుణమన్నారు. కరోనా కష్టకాలంలో కూడా కేసీఆర్ రైతుబంధు సాయాన్ని ఇచ్చినటు గుర్తుచేశారు. కేసులు పెట్టి బీఆర్‌ఎస్ పార్టీ పోరాటాన్ని ఆపలేరని, ఉద్యమ కాలంలో ఇలాంటి కేసులు చాలా ఎదుర్కొన్నామన్నారు. రైతులకు ఎకరాకు రూ.15 వేలు రైతు భరోసా వెంటనే ఇవ్వాలని, అలాగే రూ.2లక్షల రుణ మాఫీ అర్హులందరికీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేసే వరకు రేవంత్ సర్కారును వదిలేది లేదన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రాము, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి



ధన్వాడలోని రైతువేదిక వద్ద ధర్నా చేస్తున్న రైతులు

ధన్వాడ, అక్టోబర్ 23 : మద్దతు ధర లేక తీవ్రంగా నష్టపోతున్నామని, వెంటనే పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని బుధవారం స్థానిక రైతువేదిక వద్ద రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గున్ముక్ల మాజీ ఎంపీటీసీలు శ్రీనివాసులు, సుధీర్‌కుమార్‌రావు మాట్లాడుతూ పత్తి కొనుగోలు కేంద్రం లేక పోవడంతో దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ రైతులను మోసం చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా స్పందించి వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం తాసీల్దార్ సింధూజ, ఏవో దినకర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతులు శివారెడ్డి, శంకర్, నర్సింహులు, శ్రీనివాస్‌గౌడ్, సాంబశివుడు, ఆంజనేయులు, తిమ్మయ్య, బాలకృష్ణ, వీరాంజనేయులు, వంశీగౌడ్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

# సమాజ సేవలో భాగస్వాములుకావాలి

- జోగుళాంబ గద్వాల జోన్ డీఐజీ ఎల్‌ఎస్ చౌహాన్

మహబూబ్‌నగర్, అక్టోబర్ 23 : రక్త దానం చేయడం ద్వారా మరొకరి ప్రాణాలు కాపాడవచ్చని, ప్రతిఒక్కరూ ప్రజా సేవలో భాగస్వామ్యం కావాలని జోగుళాంబ గద్వాల జోన్ డీఐజీ ఎల్‌ఎస్ చౌహాన్ అన్నారు. పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన రక్త దాన శిబిరాన్ని డీఐజీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందుబాటులో లేక ప్రాణాలు కోల్పోయే అవకాశముందన్నారు. స్వచ్ఛందంగా రక్త దానం చేసి మరొకరికి ప్రాణ దానం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్పీ జానకి, ఏఎస్పీ రాములు, దవాఖాన సూపరింటెండెంట్ సంపత్ కుమార్ సింగ్, ఏఆర్ ఎస్పీ సురేశ్ కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, డీసీఆర్‌బీ డీఎస్పీ రమణారెడ్డి, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, వన్ టౌన్ సీఐ అప్పయ్య, ఆర్‌ఐ కృష్ణయ్య, రవి, ఎస్పీ పీఆర్‌వో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న సిబ్బందిని అభినందిస్తున్న డీఐజీ

# ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి

- వనపర్తి కలెక్టరేట్, మక్తల్ తాసీల్దార్ కార్యాలయాల ఎదుట విద్యార్థుల ధర్నా

వనపర్తి టౌన్, అక్టోబర్ 23 : విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఇన్‌చార్జి రమేశ్, జిల్లా అధ్యక్షుడు నరేశ్ డిమాండ్ చేశారు. బుధవారం వనపర్తి కొత్త బస్టాండ్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి కళాశాల విద్యార్థులతో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. లేదంటే విద్యార్థులను సమీకరించి ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలోని తాసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నేతలు శ్రీరామ్, గోపాలకృష్ణ, అరవింద్, భానుప్రకాశ్, చరణ్, గణేశ్, జస్వంత్, బన్ని, శివయాదవ్, శివ, భాను తదితరులు ఉన్నారు.



ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని వనపర్తి కలెక్టరేట్‌ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

### స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలి



మక్తల్ తాసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు

మక్తల్, అక్టోబర్ 23 : రాష్ట్రంలోని పేద విద్యార్థులకు అందించాల్సిన స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులు బుధవారం తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం తాసీల్దార్ సతీశ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యార్థులకు ప్రభుత్వం ఇవ్వాల్సిన రూ.6,350 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యావ్యవస్థను భ్రష్టుపట్టిస్తుందన్నారు. వెంటనే స్పందించి పెండింగ్ నిధులు మంజూరు చేయాలని, లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు శేఖర్, అజయ్, చెన్నయ్య, విజయ్, గణేశ్, రాజశేఖర్‌తోపాటు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌ది రాచరిక పాలన

- 170 మంది ఏఈవోల తొలగింపు సిగ్గుమాలిన చర్య
- కేసీఆర్ హయాంలోని ఉద్యోగాలకు నియామక పత్రాలివ్వడమేనా మీ పని..
- బీఆర్‌ఎస్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 23 : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాచరిక పాలనను కొనసాగిస్తున్నదని బీఆర్‌ఎస్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు మండిపడ్డారు. జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం కక్షసాధింపు ధోరణితో పేదల నడ్డి విరిచే ప్రయత్నం చేస్తున్నదన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత 50 వేల పైచిలుకు ఉద్యోగాలు కల్పించినట్లు ప్రగల్భాలు పలుకుతున్నారని.., మీరు చేసిన అభివృద్ధి ఏంటో అందరికీ తెలుసన్నారు. ఉద్యోగాల కల్పనకు కొంత ప్రాసెస్ ఉంటుందని.., అలాంటివేమీ లేకుండా కేసీఆర్ సర్కారు కల్పించిన ఉద్యోగాలకు ఇప్పుడు నియామక పత్రాలను ఇచ్చి ఫొటోలకు ఫోజులివ్వడమేనా మీ పని అని ప్రశ్నించారు. రెండు లక్షల ఉద్యోగావకాశాలు కల్పించకుండా నిరుద్యోగులను మోసం చేస్తున్నదన్నారు. ప్రజలు, రైతుల కోసం పని చేస్తున్న ఏఈవోలు, కానిస్టేబుళ్లతో వెట్టి చాకిరీ చేయించుకుంటూ అణిచివేత ధోరణి ప్రదర్శిస్తున్నదన్నారు. రాష్ట్రంలో 170 మంది ఏఈవోలను సస్పెండ్ చేయడం సిగ్గుమాలిన చర్య అని.., వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. ఉద్యోగులను రెచ్చగొట్టి గత ప్రభుత్వంపై లేనిపోని అభాండాలు మోపితే సహించేది లేదన్నారు. ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చలేక ప్రభుత్వం తాత్సారం చేస్తున్నదన్నారు. ఉద్యోగులతో పెట్టుకుంటే ఖబడ్దార్ అని హెచ్చరించారు. తమను అణిచి వేయాలని చూసిన చంద్రబాబుకు రైతులు కర్రుకాల్చి వాతపెట్టారన్నారు. సాధ్యం కాని హామీలిచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయలేక చేతులెత్తేస్తున్నదన్నారు. ముందుగా మీ కుటిల మైన ఆలోచనలను ప్రక్షాళన చేసుకోవాలని, అంతర్గతంగా ఉన్న కుమ్ములాటలను సరిచేసుకోవాలని సూచించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు బైకాని శ్రీనివాస్‌యాదవ్, మాజీ జెడ్పీటీసీ చిక్కొండ్ర శ్రీశైలం, ప్రదీప్, భాస్కర్ గౌడ్ నాయకులు పాల్గొన్నారు.

# 8న ప్రజాభిప్రాయ సేకరణ

- రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్
- వీసీలో పాల్గొన్న కలెక్టర్



అధికారులతో కలిసి వీసీలో పాల్గొన్న కలెక్టర్ విజయేందిరబోయి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, అక్టోబర్ 23 : వచ్చే నెల 8వ తేదీన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ తెలిపారు. మహబూబ్‌నగర్ కలెక్టర్, అధికారులతో బుధవారం బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ మాయాదేవి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నిరంజన్ మాట్లాడుతూ సమగ్ర కులాల స్థితిగతులు తెలుసుకునేందుకు ఉమ్మడి జిల్లాల వారీగా చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణను పక్కాగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమగ్ర కులాల సామాజిక, ఆర్థిక, రాజకీయ విశ్లేషణ జరపాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. అనంతరం కలెక్టర్ విజయేందిర బోయిమాట్లాడుతూ మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, జోగుళాంబ గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాలకు సంబంధించి వచ్చే నెల 8వ తేదీన మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు శివేంద్రప్రతాప్, మోహన్‌రావు, డీఆర్‌వో కేవీవీ రవికుమార్, జెడ్పీ సీఈవో వెంకటరెడ్డి, డీఆర్‌డీవో నర్సింహులు, డీపీవో పార్థసారథితోపాటు అధికారులు ఉన్నారు.

## వ్యక్తి ప్రాణాలు కాపాడిన రూరల్ పోలీసులు

నారాయణపేట రూరల్, అక్టోబర్ 23 : మండలంలోని బండగొండకు చెందిన శ్రీకాంత్‌రెడ్డిని తండ్రి మందలించడంతో మంగళవారం రాత్రి చనిపోతానని ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. వెంటనే వారు డయల్ 100కు సమాచారం అందించారు. రూరల్ ఎస్సై రాముడు సిబ్బంది ఆనంద్, ప్రదీప్‌కుమార్‌ను గ్రామానికి పంపించారు. వారు లొకేషన్ ఆధారంగా గ్రామంలోని శ్మశానవాటికలో గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి కుటుంబ సభ్యులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

# దేవదారికుంటతండాలో కమ్యూనిటీ కాంటాక్ట్

ఉప్పునుంతల, అక్టోబర్ 23 : ఉప్పునుంతల మండలం దేవదారికుంట తండాలో బుధవారం నాగర్‌కర్నూల్ అదనపు ఎస్పీ రామేశ్వర్ ఆధ్వర్యంలో పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహించారు. 65 బైక్‌లు, 4 ఆటోలు, 4 ట్రాక్టర్లు, కారును పట్టుకున్నారు. 65 మంది పోలీసులు ఇంటింటికీ తిరిగి తనిఖీలు చేపట్టారు. అలాగే ఎక్సైజ్ సీఐ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో 600 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు రవీందర్, శంకర్, ఎస్సైలు వెంకట్‌రెడ్డి, పవన్, రాజు, ఇందిర, రమేశ్ పాల్గొన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు



రావులచంద్రశేఖర్‌రెడ్డిని కలిసిన బీఆర్‌ఎస్ నేతలు

### రావులను కలిసిన బీఆర్‌ఎస్ నేతలు

వనపర్తి టౌన్, అక్టోబర్ 23 : ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలని మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ భవన్‌లో రావులను బీఆర్‌ఎస్ వనపర్తి జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, మత్స్య పారిశ్రామిక సంఘం జిల్లా అధ్యక్షుడు పుట్టా బాలరాజు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రావుల మాట్లాడుతూ.. తన హయాంలో, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి పాలనలో వనపర్తి ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. రైతుల సమస్యలపై ఈ నెల 29వ తేదీన వనపర్తిలో నిర్వహించనున్న రైతు సమర భేరీకి మాజీ మంత్రి హరీశ్‌రావు రానున్నారని, విజయవంతం చేయాలని కోరారు.

## నవోదయలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

బిజినేపల్లి, అక్టోబర్ 23 : బిజినేపల్లి మండలం వట్టెం గ్రామంలో గల జవహర్ నవోదయ విద్యాలయంలో 2025–26 విద్యా సంవత్సరానికి 9, 11వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల కోసం అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఈనెల 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ భాస్కర్‌కుమార్ బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దరఖాస్తుదారులకు 8 ఫిబ్రవరి 2025వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## గవర్నర్‌తో పీయూ వీసీ భేటీ



గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వీసీ

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబర్ 23 : రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ బుధవారం రాష్ట్రంలోని పలు యూనివర్సిటీల వీసీలతో హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పాలమూరు యూనివర్సిటీ వీసీ జీఎన్ శ్రీనివాస్ గవర్నర్‌కు మర్యాద పూర్వకంగా పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో గవర్నర్ యూనివర్సిటికి సంబంధించిన పలు అంశాలపై వీసీలకు దిశానిర్దేశం చేశారు.